సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 30 । జూలై । 2024



చేపనారు.. సాగు ఉసూరు
చేపనారు ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన ఉంగుటూరు మండలంలో బాదంపూడి మత్స్య కేంద్రం ఈ ఏడాది లక్ష్యాన్ని అందుకోవడంలో విఫలమైంది. 8లో ▸



కాంట్రాక్టు ఇంత లేటా !
రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లు ఉద్యోగం రెన్యూవల్ కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. 8లో ▸



వృద్ధురాలిపై దాడి
పాలకొల్లు నడిబొడ్డులో పట్టపగలే ఓ ఇంట్లో వృద్ధురాలిపై దాడి చేసి నగలు దోచుకున్నారు. బాధితురాలికి తీవ్రగాయాలయ్యాయి. 8లో ▸

న్యూస్‌రీల్

హామీల అమలెప్పుడు చంద్రబాబూ?



కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

వీరవాసరం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడు నెరవేరుస్తారో చెప్పాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి రూ.15 వేల సాయం, రైతు భరోసా సాయం, నిరుద్యోగభృతి, మహిళలకు నెలకు రూ.1,500, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం హామీలపై కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తానని పార్టీని స్థాపించిన పవన్ కళ్యాణ్ ప్రభుత్వంలోనే ఉంటూ ఇచ్చిన హామీల కోసం ప్రశ్నించరా అని అన్నారు. చంద్రబాబు ఖజానా ఖాళీ అంటూ అబద్ధాలతో ప్రజలను మోసం చేసే పరిస్థితిని మరోమారు తీసుకువస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో జగన్ పథకాలను ఠంఛన్‌గా తేదీ ప్రకటించి మరీ అందజేశారని గుర్తు చేశారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ కౌన్సెలింగ్
పెంటపాడు: కన్వీనర్ కోటాలో మిగిలిపోయిన పాలిటెక్నిక్ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ ఈనెల 31న నిర్వహించనున్నట్లు తాడేపల్లిగూడెం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఫణీంద్రప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-24లో ర్యాంకు వచ్చి ఎక్కడా సీటు రాని వారు, పదో తరగతి ఉత్తీర్ణులు కౌన్సెలింగ్‌కు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 31న ఉదయం 10 గంటలకు తాడేపల్లిగూడెం ఏపీ నిట్ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలకు హాజరుకావాలని సూచించారు. సివిల్, మెకానికల్ కోర్సుల్లో చేరే విద్యార్థులు సెల్ 90102 22178, 94901 04336 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇన్ సర్వీసు కోటా కొనసాగించాలి



కలెక్టర్‌కి వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు

భీమవరం: గ్రామీణ ప్రాంతాల్లో ఐదేళ్ల పాటు సేవలందిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ఇన్ సర్వీస్ కోటాను కొనసాగించాలని జిల్లా పీహెచ్ వైద్యుల సంఘం నాయకులు సోమవారం కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డాక్టర్ కిషోర్, జిల్లా అధ్యక్షుడు చినమిల్లి రంగనాయుడు, జాయింట్ సెక్రటరీ సీహెచ్ఆర్ సంతోష్ మాట్లాడుతూ జీఓ 85ను రద్దు చేయాలని, ఇన్‌సర్వీస్ కోటా 30 శాతం, నాన్ క్లినికల్ 50 శాతం కొనసాగించాలని కోరామన్నారు. మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు అన్యాయం జరుగుతోందన్నారు.

పటిష్ట ప్రణాళికతో విజయం
తాడేపల్లిగూడెం: పటిష్ట ప్రణాళిక, వ్యాపార మెలకువలు, మార్కెట్ వ్యూహాలను ఆకళింపు చేసుకుంటే అంకుర పరిశ్రమలు స్థాపించి విజయం సాధించవచ్చని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సమీర్ జావేద్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో సోమవారం ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్ వీసీ ఫండింగ్ ఆపర్ట్యునిటీ అనే అంశంపై ఆన్‌లైన్ వర్కుషాప్ నిర్వహించారు. వినూత్న ఆలోచనలు ఉన్న ఔత్సాహికులను కంపెనీలు ఏర్పాటుచేసే దిశగా ప్రోత్సహించడానికి ఏంజెల్ ఇన్వెస్టర్లు ముందుకు వస్తారన్నారు. వృద్ధి సాధిస్తే గణనీయమైన రాబడులను పొందవచ్చన్నారు. ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ కన్సల్టెన్సీ జీఆర్‌కే శాస్త్రి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యుడు ఫణికృష్ణ, కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ఆచార్యులు పి.శంకర్, వి.సందీప్, సుదర్శన దీప, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు
ఏలూరు(మెట్రో): స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాలలో రెండో రోజు సోమవారం డిపార్ట్‌మెంటల్ పరీక్షలు కొనసాగాయి. సోమవారం ఉదయం 38 మంది అభ్యర్థులకు 31 మంది, మధ్యాహ్నం 65 మందికి 50 మంది హాజరయ్యారని ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు.



ఆచంట మండలం మర్రిమూలలో జల దిగ్బంధంలోనే ఇళ్లు



యలమంచిలి మండలం కనకాయలంక గ్రామంలో ఇలా..



ఆచంట మండలం పెదమల్లంలో మాచేనమ్మ ఆలయం వద్ద వరద

భయం గుప్పెట్లోనే లంకలు

జనం.. జల దిగ్బంధం
- లంక గ్రామాలను ముంచెత్తిన వరద
- తాగునీటికి ప్రజల ఇక్కట్లు
- చిన్నారులకు పాలు కూడా దొరకని పరిస్థితి
- చర్మ సంబంధ వ్యాధుల బెడద
- ముంపు బాధితుల అవస్థలు పట్టని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వ హయాంలో సత్వర సేవలు



యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంలో రహదారిపై వరద నీరు



పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వశిష్ట గోదావరి



అయోధ్యలంకలో వాటర్‌ప్లాంట్‌ను చుట్టిముట్టి..

సాక్షి, భీమవరం: వశిష్ట గోదావరి మరోమారు ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న జలాలు దిగువన లంక గ్రామాలను ముంచెత్తుతున్నాయి. జిల్లాలోని గోదావరి పరీవాహక లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. భద్రాచలం వద్ద ఉధృతి తగ్గుతుండటం ఊరటనిస్తున్నా గోదావరి శివారు ప్రాంతం కావడంతో వరద నీరు సముద్రంలోకి చేరే వరకూ జిల్లాకు ముంపు ముప్పు పొంచి ఉంది.

పల్లపు ప్రాంతాలను ముంచుతూ..
గోదావరి ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని వశిష్ట గోదావరికి ఈనెల 19 నుంచి వరద తాకిడి మొదలైంది. 22న రాత్రి ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. జిల్లాలోని ఆచంట, పెనుగొండ, యలమంచిలి, నరసాపురం మండలాల్లోని ఏటిగట్టు పరీవాహక లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు, పంటలను వరద నీరు ముంచెత్తింది. 23 నుంచి తగ్గుముఖం పట్టడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించడం లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇంకా ముంపు నీరు లాగకుండానే మరోమారు గోదావరికి వరద పోటెత్తడంతో జలవనరులశాఖ అధికారులు మరోమారు రెండో ప్రమాద హెచ్చరికను జారీచేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 14.70 అడుగులకు చేరుకోగా 8,700 క్యూసెక్కుల నీటిని పంట కాలువలకు, 14.42 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద సోమవారం ఉదయం 6 గంటల సమయానికి 45.70 అడుగులుగా ఉన్న నీటిమట్టం సాయంత్రం 6 గంటల సమయానికి 43.10 అడుగులకు తగ్గింది. ఎగువన వరద తగ్గుతుండటంతో ఒకటి రెండు రోజుల్లో జిల్లాలోనూ తగ్గుముఖం పడుతుందని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు.

దద్దుర్లు.. చర్మ సంబంధ వ్యాధులు
జిల్లాలోని ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాల్లోని పలు లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ల చుట్టూ నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. తప్పనిసరి పరిస్థితుల్లో లంక గ్రామాల ప్రజలు ట్రాక్టర్లు, పడవలపైనే వెళ్లాల్సి వస్తుంది. తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులకు పాలు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. గోదావరి నుంచి కొట్టుకువచ్చిన విషసర్పాలు స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. వరద నీటి ప్రభావంతో స్థానికులతో పాటు పునరావాస విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి దద్దుర్లు, చర్మసంబంధిత సమస్యలు వస్తున్నాయని స్థానికులు అంటున్నారు. లంక పొలాల్లోని పాడి పశువులను ఇప్పటికే మెరక ప్రదేశాలకు తరలించారు. లంక భూములను వరద ముంచెత్తడంతో పశుగ్రాసాలకు తీవ్ర కొరత ఏర్పడింది. పశువులకు పూర్తిస్థాయిలో అధికారులు దాణా అందించడం లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోటార్లతో నీటిని తోడుతూ..
నరసాపురంలోని పొన్నపల్లి అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద పల్లపు ప్రాంతాల్లోకి, నివాసాల మధ్య వరద నీరు చేరడంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నాలుగు మోటార్ల సాయంతో నీటిని తిరిగి గోదావరిలోకి తోడుతున్నారు. నరసాపురం మండలం కొత్తనవరసపురం ఎస్సీ కాలనీల్లో మురుగు కాల్వ వెంబడి ఉన్న 75 ఇళ్లను వరద నీరు చుట్టుముట్టింది. వరదల కారణంగా ఇప్పటివరకు ఐదు తాటాకిళ్లు, నాలుగు పెంకుటిళ్లు, ఒక రేకుల షెడ్డు దెబ్బతిన్నాయి. బాధిత కుటుంబాలకు అధికారులు నిత్యావసర సరుకులను అందజేశారు.

6,105 కుటుంబాలకు వరద తాకిడి
యలమంచిలి మండలంలోని కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, బాడవ, దొడ్డిపట్ల మత్స్యకార కాలనీ, ఏటిగట్టు దిగువ ప్రాంతం, అబ్బిరాజుపాలెం గ్రామాల్లో రోడ్లపైకి వరద నీరు చేరింది. పలు ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా గ్రామాల పరిధిలోని 6,105 కుటుంబాలు వరద తాకిడికి గురయ్యాయి. బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కిలో చొప్పున కందిపప్పు, బంగాళదుంపలు, లీటర్ ఆయిల్‌ను అధికారులు అందజేస్తున్నారు. పశువులకు 25 కిలోల చొప్పున మినరల్ మిక్చర్ దాణాను పంపిణీ చేస్తున్నారు.

ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి
ఆచంట మండలంలోని అయోధ్యలంక, మర్రిమూల, అనగారిలంక, పెదమల్లంలంక, పల్లిపాలెం ప్రాంతాలు ముంపులోనే ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి. పలుచోట్ల వంట చేసుకునేందుకు వీలు కూడా లేదు. గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులతో పాటు ఆహార ప్యాకెట్లు అందించేవారని, ఇప్పుడు నిత్యావసర సరుకులు ఇచ్చినా వంట ఎలా చేసుకోవాలని బాధితులు అంటున్నారు.

పంచదార లేదు.. కందిపప్పు రాదు

కోతల కూటమి
- అరకొరగా రేషన్ పంపిణీ
- డీలర్లకు ఆగస్టు కోటా బియ్యం మాత్రమే సరఫరా
- 'ఇంటికే రేషన్' రద్దు ఆలోచనలో ప్రభుత్వం
- ప్రశ్నార్థకంగా ఎండీయూ వాహనాల పరిస్థితి
- లబోదిబోమంటున్న 5.67 లక్షల కార్డుదారులు



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

భీమవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలను అందలమెక్కిస్తామంటూ చెప్పిన మాటలు నీటిమీద రాతలుగానే మిగలనున్నాయా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే బియ్యం, పంచదార, కందిపప్పు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేయగా.. ప్రస్తుత కూటమి సర్కారు అధికారం చేపట్టి రెండు నెలలు కావస్తున్నా రేషన్ లబ్ధిదారులకు కేవలం బియ్యం పంపిణీతో సరిపెడుతోంది. జూలై నెలలో బియ్యం మాత్రమే పంపిణీ చేయగా.. ఆగస్టు నెలకు సంబంధించి కూడా రేషన్ డీలర్లకు బియ్యం మాత్రమే సరఫరా చేసింది. దీంతో వచ్చేనెల కూడా పంచదార, కందిపప్పు లేనట్లే అని తెలుస్తోంది.

5.67 లక్షల రేషన్ కార్డులు
జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5,67,671 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతినెలా రేషన్ లబ్ధిదారులకు 8,702 టన్నుల బియ్యం, 567 టన్నుల కందిపప్పు, 300 టన్నుల పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. గత జగన్ ప్రభుత్వంలో ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్) వాహనాల ద్వారా ఇంటికే రేషన్ పంపిణీ చేశారు. కార్డులో లబ్ధిదారులకు 5 కిలోల చొప్పున ఉచిత బియ్యంతో పాటు కుటుంబానికి కిలో కందిపప్పు, అరకిలో పంచదారను రాయితీ ధరలపై సరఫరా చేశారు. ఇంటికే రేషన్ సరుకులు అందడంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఆనందం వ్యక్తం చేసేవారు. అయితే కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే మరిన్ని రేషన్ సరుకులు తక్కువ ధరకు అందిస్తామని ఎన్నికల్లో ప్రచారం చేసి.. తీరా అధికారం చేపట్టిన తొలి నెలలోనే పంచదార, కందిపప్పు పంపిణీకి కోత పెట్టారు. రెండో నెల అయినా పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తారని భావించగా బియ్యంతోనే సరిపెట్టనున్నారు.

ఎండీయూ వాహనాలకు మంగళం!
పేదలకు ఇంటికే రేషన్ పంపిణీలో భాగంగా గత ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ఏర్పాటుచేసింది. అయితే పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండీయూ వాహనాల వల్ల తీవ్ర నష్ట కలుగుతుందని ఇంటికే రేషన్ పంపిణీ సరైన నిర్ణయం కాదంటూ విమర్శలు చేశారు. దీంతో ఎండీయూ వాహనాలకు త్వరలో మంగళం పాడనున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వాహనాలపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది రోడ్డు పడే ప్రమాదం ఉంది.

పోషకాహార గార్డెన్ల ఏర్పాటుకు చర్యలు
భీమవరం: పాఠశాలల ఆవరణల్లో పోషకాహార గార్డెన్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఉద్యాన పంటల సాగుపై విద్యార్థుల్లో అవగాహన, ఆవశ్యకత పెంపొందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ సాగు, స్కూల్ న్యూట్రిషన్ గార్డెన్ల అభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ, ఉద్యాన శాఖ, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ప్రతినిధులు, పీఎం పోషణ్ పథకం అమలుపై స్టీరింగ్ కమ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో ఆమె సమీక్షించారు. పాఠశాలల్లో విద్యార్థులతో ఎకో క్లబ్‌లను ఏర్పాటుచేయాలన్నారు. జిల్లాలోని 950 పాఠశాలలు పోషకాహార గార్డెన్‌ల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్టు గుర్తించామన్నారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు అధికారులు పాల్గొన్నారు.

ఇసుకకు నిర్వహణ చార్జీలు చెల్లించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీమ్ అస్మి

భీమవరం: ఇసుక ఉచితమేనని నిర్వహణ చార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుక తవ్వి తీసేందుకు, ఇతర నిర్వహణ, రవాణాకు ఖర్చులు చెల్లించాలన్నారు. కిలోమీటర్ల దూరం మేర రవాణా చార్జీలు విధిస్తారని, వీటిని జిల్లా కమిటీ ఖరారు చేస్తుందన్నారు. జిల్లాలో ఇసుక అందుబాటులో లేదని తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం, మండలపర్రు, పెండ్యాల స్టాక్ పాయింట్ నుంచి కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో డీసిల్టింగ్ పాయింట్లకు పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు.

టిప్పర్ యజమానులు సహకరించాలి
జిల్లాలోని టిప్పర్ యజమానుల సంఘంతో కలెక్టర్ సమావేశమయ్యారు. రావులపాలెం స్టాక్ పాయింట్ నుంచి 20 టన్నుల ఇసుక రవాణాకు కిలోమీటరు రూ.125 చార్జీ చేసేలా టిప్పర్ యాజమానులను కలెక్టర్ ఒప్పించారు. సమస్యలుంటే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ వెయిటింగ్ చార్జీలు లేకుండా నిర్ణయించిన ధరకే వినియోగదారులకు ఇసుక సరఫరా చేయాలన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, అడిషనల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏటీవీ రవికుమార్, ఆర్డీఓ కె.శ్రీనివాసుల రాజు, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి జి.జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

17 మంది తహసీల్దార్ల రిలీవ్
సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాకు బదిలీపై వచ్చిన 17 మంది తహసీల్దార్లను సోమవారం ప్రభుత్వం రిలీవ్ చేసింది. వారి పూర్వపు జిల్లా కలెక్టర్లకు రిపోర్ట్ చేయాలని సూచించింది. నూతన తహసీల్దార్లు విధుల్లో చేరేంత వరకూ డిప్యూటీ తహసీల్దార్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది.

తహసీల్దార్	రిలీవ్ అయిన స్థానం	ఇన్‌చార్జి తహసీల్దార్
ఎల్.శివకుమార్	భీమవరం	జి.పవన్‌కుమార్
ఎ.తాతారావు	అత్తిలి	డి.సుబ్రహ్మణ్యం
పీవీవీజేఎస్ కుమార్	ఇరగవరం	బి.మాలతి
బీఎస్ఆర్ భాస్కర్	మొగల్తూరు	జి.నరేష్‌కుమార్
ఎన్ఎస్ఎస్ ప్రసాద్	నరసాపురం	బి.సీతారత్నం
బీఎం ముక్తేశ్వరరావు	తణుకు	కేయూవీఎస్ భాస్కరరావు
జె.వెంకటేశ్వరి	ఆకివీడు	షేక్ అహ్మద్ ఫరూఖ్
ఎస్.శ్రీదేవి	కాళ్ల	ఈ.నాగార్జున
వై.రాంబాబు	గణపవరం	ఎం.సన్యాసిరావు
ఎల్‌వీఎస్ రామకృష్ణ	నరసాపురం	--
పి.మధుసూధనరావు	పాలకొల్లు	సీహెచ్ రవిరాజు
ఎస్.సురేష్‌బాబు	పెంటపాడు	యు.వెంకటేశ్వర్లు
జె.సుశీలదేవి	వీరవాసరం	కె.సుబ్బారావు
కె.లక్ష్మికల్యాణి	పెనుమంట్ర	కె.ఏలియమ్మా
ఆర్‌వీవీ రోహిణిదేవి	పెనుగొండ	ఎం.మురళీమోహన్
బి.మురళీకృష్ణ	తాడేపల్లిగూడెం	ఎస్.శివశంకర్
కె.శ్రీనివాస్	ఉండి	ఎస్‌వీఎస్ నాయుడు

క్లుప్తంగా

దుర్గమ్మకు సారె



సారె సమర్పించేందుకు విచ్చేస్తున్న ద్వారకా తిరుమల దేవస్థాన అర్చకులు, అధికారులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నుంచి దుర్గమ్మకు ఆషాడ సారెను సోమవారం సమర్పించారు. అమ్మవారికి సారెను సమర్పించేందుకు ద్వారకా తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు భాను, ఏఈవో దుర్గారావు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం సారెగా పట్టుచీర, పసుపు, కుంకుమ, పూజా సామగ్రిని ఆలయ అర్చకులకు సమర్పించారు. అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి పూజా సామగ్రికి అందజేయగా, ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం ఈవో కేఎస్ రామరావు ప్రసాదాలను, అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు.

ఐటీడీఏ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ



కేఆర్‌పురం ఐటీడీఏలో డ్యూటీ సమయంలో వీడియో గేమ్ ఆడుతున్న ఉద్యోగి

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయాన్ని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీవైఈఓ సెక్షన్‌లో ఓఎస్‌గా పనిచేస్తున్న సాయి కల్యాణ్ సెల్‌ఫోన్‌లో పబ్‌జీ ఆడుతూ ఎమ్మెల్యేకు కనిపించాడు. డ్యూటీ సమయంలో గేమ్స్ ఆడటంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న సాయి కల్యాణ్‌ను సస్పెండ్ చేయాలని ఇన్‌చార్జి పీఓ శ్రీనుకుమార్‌ను ఆదేశించారు. రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



రుస్తుంబాదలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటరెడ్డి

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో సోమవారం రాత్రి రుస్తుంబాద, ఎల్బీ చర్ల గ్రామాల్లో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. రుస్తుంబాద జాతీయ రహదారిపై ఆగిఉన్న ఓఎన్‌జీసీ లారీని ఢీకొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మరణించారు. మృతుడిని పెనుమంట్ర మండలం జుత్తుగకు చెందిన వెంకటరెడ్డి (43)గా గుర్తించారు. వెంకటరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎల్బీచర్ల గ్రామంలో లేసు భవనం వద్ద సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆటో, బైక్ ఢీ కొన్న సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న గుబ్బల భాను ప్రకాష్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రకాష్ మృతదేహాన్ని నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చేపనారు.. సాగు ఉసూరు

బాదంపూడి మత్స్య కేంద్రంలో కొనసాగుతున్న చేపనారు ఉత్పత్తి



తల్లి చేపలకు ఇంజెక్షన్ ఇస్తున్న మత్స్య శాఖ అధికారి, ఇన్‌సెట్‌లో సిమెంటు కుండీల్లో చేపనారు

ఉంగుటూరు: చేపనారు ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన బాదంపూడి మత్స్య కేంద్రం ఈ ఏడాది లక్ష్యాన్ని అందుకోవడంలో విఫలమైంది. ఈ ఏడాది 20 కోట్లు నారు ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం నిర్ధారించింది. అయితే చేపకు అంతగా ధర లేకపోవడంతో నారు బయటకు వెళ్లే మార్గం లేక 10 నుంచి 12 కోట్ల మధ్యలో చేపనారు తయారు చేస్తున్నారు. పూర్వం ఇక్కడ తయారైన చేపనారు ఉమ్మడి రాష్ట్రంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు ఫాంలకు, రైతులకు సరఫరా చేస్తారు. జిల్లాలోని రిజర్వాయర్లకు ఉచితంగా అందచేయడం, ప్రైవేటు ఫాంలకు, రైతులకు విక్రయించడానికి ఉత్పత్తిచేసేవారు. అయితే తయారైన చేపనారుకు డిమాండ్ తగ్గడంతో ఈ ఏడాది ఆశాజనకంగా వ్యాపారం సాగలేదు.

జలాశయాల్లో వదులుతున్న నారు

చేపనారు ఉత్పత్తి జూన్ రెండో వారంలో మొదలు పెట్టారు. ఇప్పటికి 1.14 కోట్ల చేపనారు ఉత్పత్తి చేశారు. ఉత్పత్తి చేసిన చేపనారును కొవ్వలి, నర్సాపురం, తణుకు, ఏలూరు, కృష్ణా జిల్లా మాటూరు ప్రభుత్వ ఫాంలకు సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం కొవ్వలి ఫాంకు అందజేస్తున్నారు. 3 నుంచి 4 అంగుళాల మేర కుండీల్లో, చెరువుల్లోను పెంచిన ఆ చిరు చేపను గోదావరి నదిలో, పోగుండ, జల్లేరు జలాశయాల్లో ఉచితంగా వదులుతారు. ఆ పిల్లలు పెద్దవై మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేవి. తల్లి చేపలను ఈ ఏడాది ఓ టన్ను చేపలను కొనుగోలు చేశారు. ఈ చేపలు స్థానిక ఫాంలో ఉండే చెరువుల్లో పెంచుతూ చేపపిల్ల ఉత్పత్తికి ఉపయోగిస్తున్నారు.

ఆలస్యంగా ఉత్పత్తి ప్రారంభం

సకాలంలో కాలువకు నీరు రాకపోవడంతో ఆలస్యంగా చేపనారు ఉత్పత్తి ప్రారంభించాం. తల్లి చేపలు సేకరించి ఉత్పతి ప్రారంభించాం. స్టాకు నిల్వ చేసే పరిస్థితి తక్కువగా ఉండడం, తయారైన చిరుచేప బయటకు వెళ్లే మార్గం తగ్గిపోవడంతో.. సామర్థ్యం ఉన్నా లక్ష్యాలను అందుకోవడంలో ఇబ్బందులు పడుతున్నాం.

– నర్సయ్య, మత్స్య శాఖ ఏడీప

కాంట్రాక్టు ఇంత లేటా!



నూజివీడులోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల

నూజివీడు: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లు ఉద్యోగం రెన్యువల్ కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తున్నారు. లెక్చరర్ల పోస్టులు భర్తీ చేయనప్పటికీ రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల మనుగడను కాపాడుతున్న కాంట్రాక్టు లెక్చరర్ల ఉద్యోగాలను రెన్యువల్ చేయడంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. వేసవిలో అడ్మిషన్ల కోసం ఇంటింటికి తిరిగి జూనియర్ కళాశాలలకు అడ్మిషన్లు తీసుకొచ్చిన తమ కాంట్రాక్టును రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు రెన్యువల్ చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 3,618 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు ఉన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వీరి వేతనాలు రూ.27,100 నుంచి రూ.37,100కు ఆ తరువాత రూ.57,100కు పెరిగాయి. ప్రభుత్వ కళాశాలలకు పిల్లలను పంపని ఈ రోజుల్లో సైతం పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నేడు వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారంటే కాంట్రాక్టు లెక్చరర్ల కృషితోనే చేరుతున్నారు. ఏటా మే నెలలో కాంట్రాక్టు లెక్చరర్లు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్ళి తమ కళాశాలలో చేరితే లాభాలను వివరించడమే కాకుండా, పిల్లల భవిష్యత్‌కు తమది బాధ్యత అని భరోసా ఇవ్వడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇంత చేస్తున్నా తమ కాంట్రాక్టును రెన్యువల్ చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంతవరకూ జీతాలు లేవు

ప్రతి విద్యాసంవత్సరంలో వీరి కాంట్రాక్టు జూన్‌లోనే రెన్యువల్ అవుతుండగా ఈ సంవత్సరం జూలై నెల ముగుస్తున్నప్పటికీ ఇంతవరకు రెన్యువల్ చేయలేదు. వీరికి జూన్, జూలై నెలల వేతనం ఇంతవరకు రాలేదు. రెన్యువల్ చేయనప్పటికీ కాంట్రాక్టు లెక్చరర్లు కళాశాలలకు వెళ్ళి తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంత చేస్తున్నా వీరిపట్ల ప్రభుత్వం నిర్దయగా వ్యవహరించడంపై తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

దిగమర్రులో పిచ్చికుక్క దాడి



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు సీతమ్మ



కాలిమీద కరవడంతో తీవ్రంగా గాయమైన దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో సోమవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలో బీభత్సం సృష్టించింది. గ్రామంలోని కుక్కలను కరవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. స్థానవరపు సీతమ్మ అనే వృద్ధురాలిని జబ్బ, భుజం, కాలిపైనా తీవ్రంగా కరచింది. బండి రామకృష్ణ కాలిపై బలంగా కరిచింది. రాపాక జాన్సన్‌పై దాడి చేసి చేతిమీద గాయం చేసింది. సర్పంచ్ రాపాక నగేష్ కరుణాకర్‌పై కూడా పిచ్చికుక్క దాడి చేసింది. ఆయన తృటిలో గాట్లనుంచి తప్పించుకున్నారు. బాధితులంతా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. వృద్ధురాలు త్రుటితో ప్రాణాపాయం నుంచి తప్పించుకుంది. స్థానిక యువత పిచ్చికుక్కను కొట్టి చంపారు. పిచ్చి కుక్క గ్రామంలో తిరిగే వీధికుక్కలను కరిచింది. దీనివలన ఆ వీధి కుక్కలకు వైరస్ సోకే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణం వీధికుక్కలన్నింటికి యాంటీ వైరస్ వ్యాక్సిన్ ఇచ్చి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

వృద్ధురాలిపై దాడి.. 8 కాసుల బంగారం చోరీ



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు అనసూయ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు నడిబొడ్డులో పట్టపగలే ఓ ఇంట్లో వృద్ధురాలిపై దాడి చేసి నగలు దోచుకున్నారు. పట్టణంలోని బొండాడ వారివీధిలో కలిశెట్టి అనసూయ నివసిస్తున్నారు. ఆమె భర్త రిటైర్డ్ ఉపాధ్యాయుడు కాగా కొంతకాలం క్రితం మృతి చెందారు. అనసూయ అనారోగ్యంతో ఉండడంతో భవనం కింద పోర్షన్‌లో ఉంటున్నారు. ఆమెకు సహాయకురాలిగా ఓ ఆయాను ఏర్పాటుచేశారు. అనసూయ కుమార్తె, అల్లుడు అదే భవనంలో పైన ఉంటున్నారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఆయా భోజనం చేయడానికి మేడపైకి వెళ్లింది. అప్పటికే ఇంటి సమీపంలో ఇద్దరు వ్యక్తులు అటూ ఇటూ తిరగుతున్నారు. ఆయమ్మ భోజనానికి వెళ్లిన వెంటనే ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు గేటు తీసుకుని లోనికి వెళ్లి అనసూయ పడుకున్న మంచం కింద ఉన్న రాయిని తీసి ఆమె తలపై కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు పూసల దండ లాక్కుని, ఇంట్లో మరి కొన్ని బంగారు వస్తువులను చోరీ చేశారు. కిందకు వచ్చిన ఆయమ్మ రక్తపు మడుగులో ఉన్న అనసూయను చూసి కేకలు వేయడంతో అల్లుడు, కుమార్తె కిందకు వచ్చి చూశారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 8 కాసుల బంగారం చోరీకి గురైనట్లు బంధువులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మీడియాతో మాట్లాడుతూ సీసీ పుటేజీ ద్వారా ఈ సంఘటనకు ఇద్దరు వ్యక్తులు కారణమని గుర్తించినట్లు చెప్పారు. ప్రత్యేక పోలీసు బృందం దర్యాప్తు మొదలుపెట్టింది. జాగిలం, క్లూస్ టీం ఆధారాలు సేకరించాయి. అనసూయను పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తీసుకెళ్లారు. బాధితురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బంగారం తాకట్టు కేసులో ట్విస్ట్

- వ్యాపారి మోసం చేశాడని పోలీసులను ఆశ్రయించిన మహిళ
- వ్యాపారి తీరుపై అనుమానాలు

నరసాపురం: నరసాపురంలో ఓ మహిళ నకిలీ నగలు కుదువపెట్టి రూ.70.60 లక్షలు టోకరా వేసిందంటూ ఈ నెల 26న నరసాపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాగా.. ఆరోపణలు ఎదుర్కొంటున్న శరిగినీడి ఉషారాణి తాకట్టు వ్యాపారి తనను మోసం చేసి బెదిరిస్తున్నాడని సోమవారం నెల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కిలాడి లేడీ అంటూ తన ప్రతిష్టను దిగజార్చారని, న్యాయం చేయాలని మానవహక్కుల సంఘానికి కూడా ఫిర్యాదు చేసింది. నెల్లూరు లా కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసిస్తున్న ఉషారాణి స్పందిస్తూ.. కిలోపైగా బంగారు ఆభరణాలు కుదువపెట్టి అప్పు తీసుకున్న మాట వాస్తమని, 2 ఏళ్లుగా వడ్డీ కూడా చెల్లిస్తున్నానని దానికి సంబంధించి రసీదులు తన వద్ద ఉన్నాయని చెప్పారు.

వ్యాపారి తీరుపైనా అనుమానాలు?

నరసాపురంలో తాకట్టు వ్యాపారం కూడా జోరుగా సాగుతుంది. గ్రాము బంగారంపై తాకట్టు ఇవ్వడానికి సవాలక్ష పరీక్షలు చేసి గానీ సొమ్ము చేతిలో పెట్టరు. అలాంటిది ఉషారాణికి తాకట్టు వ్యాపారి చెబుతున్నట్టు ఏకంగా రూ.70 లక్షలు సొమ్ము ఇచ్చి ఆమె ఇచ్చిన ఆభరణాలు అసలువా? నకిలీవా? అని పరీక్ష చేయకుండా ఉండటం పెద్ద ప్రశ్న. ఉషారాణి పలు దఫాలుగా నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.70 లక్షలు పట్టుకెళ్లినట్టు చెపుతున్నారు. ఆమె ఇస్తున్న ఆభరణాలు సరిచూసుకోకుండా ఎలా సొమ్ములు ఇచ్చారన్నది ఇంకో ప్రశ్న. చాలాకాలంగా నరసాపురం బులియన్ వర్తలకుపై అటు బంగారం వ్యాపారంలోను, ఇటు తాకట్టు వ్యాపారంలోను కూడా అనేక ఆరోపణలు ఉన్నాయి. ఉషారాణి వ్యవహారంలో ఇవన్నీ తెరమీదకు వస్తున్నాయి. తాను కుదవపెట్టిన అసలు నగలు కొట్టేయడానికి వ్యాపారి ఈ నాటకం ఆడుతున్నారంటూ ఉషారాణి న్యాయ పోరాటానికి కూడా సిద్ధమవ్వడం అటు బులియన్ వర్గాల్లో ఇటు ప్రజల్లో హాట్ టాపిక్‌గా మారింది.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడితో పోలీసు అధికారులు

కొయ్యలగూడెం: బిలిమిల్లి గ్రామంలో హత్యకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ సోమవారం పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయిగూడెం మండలం రాజానగరం గ్రామానికి చెందిన కొమరం శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న దిప్పకాయలపాడు పంచాయతీ బిల్లిమిల్లి గ్రామంలో సోడెం వెంకటేష్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. నిందితుడు శ్రీనివాస్ కొంతకాలం క్రితం బిల్లిమెల్లికి కూలీ పనుల కోసం వచ్చాడు. ఆ సమయంలో మృతుడి మేనల్లుడితో నిందితుడి భార్య చనువుగా ఉండటంపై శ్రీనివాస్ అభ్యంతరం తెలిపి మందలించాడు. అయినప్పటికీ ఇద్దరి మధ్య సంబంధం కొనసాగడంతో పెద్దల మధ్య తగువు పెట్టారు. కుల పెద్దలు శ్రీనివాస్ భార్యను మందలించి శ్రీనివాస్‌తో పంపి వేయగా కొద్ది రోజులకు మళ్ళీ ఆమె మృతుడి మేనల్లుడి వద్దకు వచ్చేసింది. అయితే వెంకటేష్ వల్లే తన భార్య తనకు దూరమైందని శ్రీనివాస్ కక్ష పెంచుకున్నాడని.. వెంకటేషు ఒంటరిగా నిద్రిస్తుండగా కత్తితో నరికి హత్య చేశాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనగా 'అనూహ్యం' ఎంపిక



తిరుపతి అభినయా.. హనుమా అవార్డుల పోటీల్లో బహుమతి అందుకుంటున్న అనూహ్యం నాటిక బృందం

పాలకొల్లు అర్బన్: తిరుపతి హనుమా అవార్డుల జాతీయ స్థాయి నాటిక పోటీల్లో పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య కళాకారులు ప్రదర్శించిన 'అనూహ్యం' నాటిక ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా ఎంపికైంది. ఈ పోటీలు తిరుపతి మహతి కళాక్షేత్రంలో ఈ నెల 20 నుంచి 28 వరకు నిర్వహించారు. రచయిత, నటుడు, దర్శకుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు స్వీయ రచనలో కత్తుల రామమోహన్‌రావు దర్శకత్వంలో ఈ నాటికను పోటీల్లో ప్రదర్శించినట్లు నిర్వాహకుడు గుడాల హరిబాబు సోమవారం తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలో అనూహ్యం నాటికను పలు పరిషత్‌లతో ప్రదర్శించి బహుమతులు సాధించడం ద్వారా పాలకొల్లు పట్టణానికి పేరు ప్రతిష్టలు తీసుకువస్తున్న కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్టీసీ బస్సులో చోరీ

ఉండి : తెలంగాణా రాష్ట్రం ఖమ్మంకు చెందిన భార్యాభర్తలు కాళ్ల మండలంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన శుభకార్యంలో పాల్గొని బస్సులో తిరిగి వెళ్తుండగా వారి వద్ద ఉన్న బంగారం చోరికి గురైంది. ఉండి మండలం కోలమూరు ఉప్పులూరు రోడ్డు వద్ద బస్సు ఎక్కిన భార్యాభర్తలను గుర్తించిన ఇద్దరు మహిళలు బస్సెక్కారు. కొద్దిసేపటికి వారు బస్సులో కనిపించలేదు. కొంతసేపటికి బ్యాగులో ఉండాల్సిన విలువైన బంగారు ఆభరణాలను కనిపించక పోవడంతో భర్తకు విషయాన్ని చెప్పింది. అప్పటికే బస్సు ఉంగుటూరు మండలం నారాయణపురం చేరుకుంది. అక్కడి నుంచి మళ్లీ ఉండికి వెళ్లారు. బంధువుల సహకారంతో కేసు పెట్టేందుకు ప్రయత్నించగా కేసు నారాయణపురం పరిధిలోకి వస్తుందని పోలీసులు చెప్పడంతో వారంతా అక్కడికి వెళ్లారు. ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ మృతి

కైకలూరు: రోడ్డు సమీపంలో నడుచుకుంటూ వస్తుండగా.. స్కూటీ ఢీకొని చర్చి పాస్టర్ మరణించిన ఘటన పల్లెవాడలో సోమవారం జరిగింది. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం కైకలూరు మండలం భుజబలపట్నంకు చెందిన ముచ్చుల రమేష్(63) పల్లెవాడ చర్చిలో పాస్టర్‌గా పనిచేస్తున్నాడు. పార్థన పూర్తి చేసుకుని వస్తుండగా ఆకివీడు నుంచి గుడివాడ వెళ్తున్న గూడపాటి నరేంద్రబాబు స్కూటీతో అతనిని ఢీకొట్టాడు. బలమైన గాయమైన పాస్టర్ రమేష్ అక్కడికక్కడే మరణించాడు. భార్య మార్తమ్మ ఫిర్యాదుపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఒక వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతి బస్ తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన బాలిక 10వ తరగతి పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. ఇన్‌స్టాలో జంగారెడ్డిగూడెంకు చెందిన రిషి అనే వ్యక్తి పరిచమయ్యాడని, అతన్ని కలిసేందుకు బాలిక జంగారెడ్డిగూడెం రాగా, రిషి బస్టాండ్‌కు వచ్చి మళ్లీ వస్తానని బాలికకు చెప్పి వెళ్లిపోయాడన్నారు. తిరిగి రాకపోవడంతో, బస్టాండ్ వద్దే ఉన్న బాలికను బంటుమిల్లి శ్రీను తన ఇంటికి తీసుకువెళ్లాడన్నారు. ఈ క్రమంలో వేగవరానికి చెందిన రాజు పరిచయమై, ఊరు పంపిస్తానని చెప్పి జంగారెడ్డిగూడెంలో ఒక రూంలో ఉంచాడని, ఈ నెల 26న బాలికను కొట్టి, అత్యాచారం చేశాడన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడు మృతి

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైలు ఢీకొట్టి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు చెబుతున్నారు. మృతుడి వయస్సు 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుందని, 5.5 అడుగుల ఎత్తు, కోల ముఖం, తెలుపు జుట్టు, కుంకుమ రంగు చొక్కా, కాషాయం రంగు టవల్ కట్టుకుని ఉన్నాడన్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని శవ పంచానామా నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిస్తే 9989219559 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

జంగారెడ్డిగూడెంలో చైన్ స్నాచింగ్

జంగారెడ్డిగూడెం: పట్టణంలో చైన్‌స్నాచింగ్ ఘటన చోటు చేసుకుంది. స్థానిక పాత ఎల్ఐసీ బిల్డింగ్ సమీపంలో ముగ్గురు మహిళలు సోమవారం రాత్రి నడిచి వెళ్తున్నారు. మోటార్‌సైకిల్‌పై వచ్చిన యువకుడు పసుపులేటి మమత మెడలోని మూడున్నర కాసుల చైన్ లాక్కుని పారిపోయాడు. సీఐ పి.రాజేష్, ఎస్సై జి.జ్యోతిబస్‌లు ఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

క్లుప్తంగా

కుండపోత వర్షం, జలమయమైన రోడ్లు



తణుకులో కురిసిన వర్షానికి జలమయమైన ప్రధాన రోడ్లు

తణుకు: పట్టణంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణం సాధారస్థాయిలో ఉన్నప్పటికీ సోమవారం సాయంత్రం సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగి ప్రవహించడంతో రాష్ట్రపతి రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా బ్యాంకు కాలనీ, ఇరగవరం కాలనీ, ఎన్జీవో కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యార్థులు, ఉద్యోగులు నివాసాలకు వెళ్లే సమయం కావడంతో వీరంతా ఇబ్బంది పడ్డారు. చిరు వ్యాపారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న వాకర్స్ మహిళా సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని వాకర్స్ వాకర్స్ మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. వాకర్స్ ఆధ్వర్యంలో వాకింగ్ ట్రాక్ వద్ద సోమవరం మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సభ్యులు ఇందిరాకుమరి, ఉదయ్ కుమారి, రామలక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

తణుకు: ఇటీవల కురిసిన వర్షాలు, వరదలు కారణంగా ముంపునకు గురైన తణుకు మండలం దువ్వ గ్రామంలోని నిరాశ్రయులకు పైడిపర్రు–తేతలి లయన్స్‌క్లబ్, ఉండుర్తి పాల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు, శానిటరీ పాడ్స్ పంపిణీ చేశారు. దువ్వ గ్రామంలోని వయ్యేరు పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్ నాయకులు బాబూజీ, గోవింద్, ప్రసన్నకుమార్, సజని, జి.ఆశాజ్యోతి, ఇతర వలంటీర్లు పాల్గొన్నారు.

యోగాతో మంచి ఆరోగ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాతో మంచి ఆరోగ్యం సాధ్యపడుతుందని యోగ గురువులు కరిబండి రమకృష్ణ, లయన్ మద్దుల సుభద్రలు అన్నారు. స్థానిక రాకెట్ పార్కులో లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన సదుస్సులు నిర్వహించడం, చైతన్యం కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయరాదు

పెంటపాడు: రాబోయే తరాలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ప్రతిఒక్కరూ ఇంకుడు గుంతల ఆవశ్యకతను గుర్తించాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో సోమవారం జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాగునీటిని వృథా చేయడం వల్ల కలిగే అనర్థాలను స్థానిక రసాయనశాస్త్ర అధ్యాపకులు సురేంద్ర వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ప్రేమ్ సాగర్, ఎన్ఎస్ఎస్ అధికారి విజయబాబు, సుంకర గోపాల్ తదతరలు పాల్గొన్నారు.

కాలేయ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు అర్బన్: కాలేయ వ్యాధుల పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. కాలేయ వ్యాధి నివారణ జాతీయ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ మాట్లాడుతూ హెపటైటిస్ (వైరస్ సంబంధిత కాలేయ వ్యాధి) బి, సి వ్యాధులను అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకంగా పరిణమిస్తాయని అన్నారు. కొన్ని రకాల ఆహార అలవాట్లతో పాటు రక్తం మార్పిడి, వాడిన సిరంజిలు ఉపయోగించడం, తల్లి నుంచి బిడ్డకు సోకుతుందని అన్నారు. కాలేయ వ్యాధి సోకిన వారు ఎటువంటి భయాందోళనలు పడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అందిస్తున్న మూడు నెలల కోర్సును క్రమం తప్పకుండా వాడితే నివారించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శారద ప్రసన్న, ఎల్ సాయిబాలాజీ, డాక్టర్ శ్రీరాజ్, ఎన్‌టీసీ సోషల్ వర్కర్ జి.సాధు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో తణుకు తళుకులు

- క్రీడాకారులను సృష్టిస్తున్న తణుకు క్రీడా ప్రాంగణం
- శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా
- ఒలింపిక్స్‌కు ఎంపికైన జ్యోతికశ్రీ అడుగులు ఇక్కడే
- ఎంతో మందిని క్రీడాకారులుగాను, ఉపాధి చూపిన ప్రాంగణంగా
- నిత్యం అథ్లెటిక్స్‌లో పరిగెడుతున్న యువత



తణుకు ఎస్కేఎస్‌డీ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో శిక్షణ తీసుకుంటున్న కబడ్డీ టీం

తణుకు అర్బన్: దేశాన్ని కాపాడే జవాన్‌ల నుంచి క్రీడల్లో సత్తాచాటే యువతతో పాటు క్రీడల ద్వారా ఉద్యోగాలు సాధించే వారికి వేదికగా నిలిచింది తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణం. వందలాది మంది జవాన్లు, క్రీడాకారులుగా ఈ క్రీడా ప్రాంగణంలో వేసిన అడుగులు వారి భవిష్యత్తును బంగారుబాటగా తీర్చిదిద్దబడ్డాయి. ముఖ్యంగా అథ్లెటిక్స్, కబడ్డీ విభాగాలతో పాటు పరుగు పందాల్లో ఇక్కడ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరిసి తణుకు ప్రాంతానికి గుర్తింపు తీసుకువచ్చారు. అందులో ప్రధానంగా దండి జ్యోతికశ్రీ అనే అమ్మాయి ఈ క్రీడా ప్రాంగణంలో ప్రాక్టీస్ చేసి నేడు పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో భారత దేశం తరపున అరంగ్రేటం చేయనుంది.

వేలాది మంది శిక్షణ తీసుకున్న ప్రాంగణం

తణుకు చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో అడుగులు వేసిన యువత నేడు వారిని మంచి స్థితిలో నిలిపాయి. అథ్లెటిక్స్ విభాగంలో కీర్తిశ్రీ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ తరపున కోచ్ కట్లపర్తి సీతారామయ్య గత 25 ఏళ్లకాలంలో ఎంతో మంది బాలబాలికలతో పాటు యువతను అథ్లెటిక్స్‌వైపు నడిపించారు. ఆయన హయాంలో వందలాదిమంది యువత అథ్లెటిక్స్ విభాగంలో రాణించి జాతీయస్థాయి పతకాలు సాధించారు. అనేక మంది క్రీడల్లో వచ్చిన గుర్తింపుతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఇక కబడ్డీకి సంబంధించి గత 12 సంవత్సరాలుగా స్పేస్ క్లబ్ కోచింగ్ సెంటర్ పేరుతో కోచ్ వై.శ్రీకాంత్ ఎంతో మంది యువతకు కబడ్డీ ఆట నేర్పించి వారికి ఉపాధి కల్పించారు. ఇలా కోచ్‌ల శిక్షణలో కొందరు, స్వయంగా కొందరు క్రీడాపోటీల్లో తణుకు ప్రాంతానికి గౌరవాన్ని తెచ్చారు. క్రీడల్లో సాధించిన ధ్రువపత్రాలతో ఎస్ఐలు, కానిస్టేబుల్స్, రైల్వే జాబ్స్, ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ తదితర ఉద్యోగాలు సాధించారు.

ప్రధాన ఆకర్షణగా దండి జ్యోతికశ్రీ...

దేశ వ్యాప్తంగా మారుమోగుతున్న పేరు తణుకుకు చెందిన దండి జ్యోతికశ్రీ 2013లో ఇదే క్రీడా ప్రాంగణంలో తండ్రితోపాటు వేసిన అడుగులు నేడు పారిస్ వరకు నడిపించాయి. కోచ్ సీతారామయ్య శిక్షణలో రాటుదేలి ఇదే క్రీడా ప్రాంగణం నుంచి రెండు జాతీయస్థాయి మెడల్స్ సాధించి అందరి చూపు తనవైపు తిప్పుకుంది.

తణుకు క్రీడా ప్రాంగణాన్ని మరువలేను

2013లో తణుకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నా కుమార్తె జ్యోతికశ్రీ మొదలుపెట్టిన పరుగు నేడు పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్లడం నాకు చాలా సంతోషంగా ఉంది. కోచ్ సీతారామయ్య సారథ్యంలో జాతీయ స్థాయి పతకాలు సాధించింది. చిన్నతనంలోనే జ్యోతికశ్రీ వేసిన అడుగులను మరచిపోలేను. ఈ క్రీడా ప్రాంగణం నాకుమార్తెతోపాటు చాలా మంది యువతకు భవిష్యత్తును కలుగజేసింది. వచ్చేనెల 9వ తేదీన 400 మీటర్ల రిలే పోటీల్లో భారతదేశం తరపున నా కుమార్తె పరుగు పెట్టేందుకు సిద్ధమైంది. తణుకు ప్రజలంతా నా కుమార్తెను ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నాను.

జ్యోతికశ్రీ ప్రథమ కోచ్‌గా గర్విస్తున్నాను



తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణం వేదికగా అథ్లెటిక్స్‌లో యువతను తీర్చిదిద్దగలిగాను. నా శిక్షణలో రెండు జాతీయ పతకాలు సాధించిన జ్యోతికశ్రీ నాకు ఒక మైలురాయి వంటిది. జ్యోతికశ్రీలో ఉన్న ప్రతిభను చూసి ప్రత్యేక శ్రద్ధపెట్టడంతో టర్కీ దేశంలో అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగులో పాల్గొంది. అంతేకాకుండా ఇదే ప్రాంగణంలో శిక్షణ పొందిన 125 మందికిపైగా నా శిష్యులు పోలీసుశాఖలో ఎస్ఐలు, కానిస్టేబుల్స్, ఆర్మీ, సీఆర్‌పీఎఫ్‌లో ఉద్యోగాలు సాధించారు. ఒలింపిక్స్‌కు ఎంపికైన జ్యోతికశ్రీకి ప్రథమ కోచ్‌గా నేను గర్విస్తున్నాను.

– కట్లపర్తి సీతారామయ్య, కీర్తిశ్రీ స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్ కోచ్, తణుకు

నాకు చాలా సంతృప్తిగా ఉంది



చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణం వేదికగా కబడ్డీ క్రీడపట్ల ఆసక్తి కనబరచిన యువతను గుర్తించి వారికి కబడ్డీ క్రీడలో పూర్తిస్థాయి శిక్షణ నిచ్చి ప్రత్యేక టీంను తయారుచేయగలిగాను. గత 12 సంవత్సరాలుగా యువతకు కబడ్డీ క్రీడను నేర్పిస్తూ వారిని జాతీయ స్థాయికి పంపించగలిగాను. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీగా ఉంటూ అంతర్జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీలను అదే సౌకర్యాలతో ఏర్పాటుచేసి ప్రతిభావంతులను తయారుచేశాను. వారిలో చాలా మంది కబడ్డీలో పొందిన ధ్రువపత్రాలద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

– వై.శ్రీకాంత్, స్పేస్ క్లబ్ కోచింగ్ సెంటర్ కోచ్, తణుకు



తణుకు ఎస్కేఎస్‌డీ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో వాకింగ్ చేస్తున్న వాకర్స్



అథ్లెటిక్స్ ప్రాక్టీస్ చేసి పారిస్ ఒలింపిక్స్‌కు ఎంపికైన దండి జ్యోతికశ్రీతో తండ్రి శ్రీనివాసరావు



తణుకు ఎస్కేఎస్‌డీ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు (ఫైల్)

పౌష్టికాహార లోపంతోనే విద్యార్థినికి అనారోగ్యం



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో జానకికి వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పౌష్టికాహారం లోపం కారణంగానే 9వ తరగతి విద్యార్థిని జానకి అనారోగ్యానికి గురైందని ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి తెలిపారు. తాడేపల్లిగూడెంలో శాంతి రెసిడెన్షియల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ హాస్టల్‌లో జానకి ఉంటున్నట్లు విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి జానకి అస్వస్థతకు గురవడంతో మిషనరీ హాస్టల్ యాజమాన్యం ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. జానకి పౌష్టికాహారం లోపం కారణంగా అస్వస్థతకు గురైందని ఆసుపత్రిలోని వైద్యులు తెలపడంతో ఆమెను ఆ రాత్రే తీసుకుని వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీఓ టీఎల్ సరస్వతి సోమవారం మిషనరీ హాస్టల్‌ను, వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతి రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీలు చేశారు. అనంతరం సరస్వతి మాట్లాడుతూ మిషనరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్‌కు అనుమతి లేదని చెప్పారు. 1 నుంచి 5వ తరగతి వరకే వీరికి పాఠశాల, హాస్టల్ నిర్వహించేందుకు అనుమతి ఉందన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు పాఠశాల, హాస్టల్ నిర్వహణకు అనుమతులు లేవని సరస్వతి తెలిపారు. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులు 30 మంది, 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 107మంది మొత్తం 137 మంది విద్యార్థులు మిషనరీ హాస్టల్‌లో ఉంటున్నట్లు సరస్వతి తెలిపారు. మిషనరీ హాస్టల్లో ఉంటున్న ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాలు, సదుపాయలు హాస్టల్‌లో కల్పించలేదని పరిశీలనలో గుర్తించామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసకుంటామని ఐసీడీఎస్ సీడీపీఓ తెలిపారు.

పాలస్తీనా సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు

తణుకు: పాలస్తీనాకు భారత్ అండగా నిలిచి ఇజ్రాయల్ చేస్తున్న అరాచక యుద్ధాన్ని ఆపాలని డీవీవీఎస్ వర్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కోరారు. సోమవారం పాలస్తీనా సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో తణుకు నరేంద్ర సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ, ప్రతాప్‌లు మాట్లాడుతూ గత 295 రోజులుగా పాలస్తీనా ప్రజలపై అమెరికా అండతో అన్యాయంగా యుద్ధం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఈ యుద్ధంలో 39 వేల మంది చనిపోయారని గుర్తు చేశారు. ఈ దారుణాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు బొద్దాని నాగరాజు, సంకు మనోరమ, పేరూరి మురళీకుమార్, అంబేద్కర్, కడలి రామారావు, దిర్శిపో రామకృష్ణ, సలీమ్, అబ్దుల షుకూర్, ఇబ్రహీం, అన్వర్, గుబ్బల గోపి, మల్లిపూడి లక్ష్మి, కామన మునిస్వామి, పి.దక్షిణమూర్తి, బళ్ల చినవీరభద్రరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



బహుమతులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు, హెచ్ఎం బ్రహ్మం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గత నాలుగేళ్లుగా పాఠశాలలో పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు అభినందనీయమని సంజీవనగర్ మునిసిపల్ హైస్కూల్ హెచ్ఎం బ్రహ్మం కొనియాడారు. పట్టణంలోని సంజీవనగర్ హైస్కూల్‌లో 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మొదటి స్థానం సాధించిన ఈ.ఆమూల్యకు రూ.10 వేలు, రెండో బహుమతి సాధించిన టి.భవానీ శంకర్‌కు రూ.6 వేలు, మూడో స్థానం సాధించిన ఏ ప్రవల్లికకు రూ.4 వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎస్.సునీత, రజియ, మనోహర్ రెడ్డి, మహాలక్ష్మి, లీల, అర్జా సత్యభాస్కర్, పి.శ్రీనివాస్. జి.సత్యనారాయణ, కె.బాలాజీ, సీహెచ్ దుర్గా కుమార్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బడుగుల అభివృద్ధికి రుణాలు అందించాలి



సభలో మాట్లాడుతున్న దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రవిప్రకాష్

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీనవర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి లిడ్ క్యాప్ ద్వారా సంక్షేమ పథకాలు, సబ్సిడీపై రుణాలు అందేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. సోమవారం తాడేపల్లిగూడెం పట్టణం మాగంటి కల్యాణ మండపంలో దళితసేన నాల్గవ ఆవిర్భావ రాష్ట్ర సభ జరిగింది. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర పెద్దల సహకారంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీనవర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి, సమాజంలో గౌరవంగా బతకడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కపాముల చంటి, నాయకులు చీలి మోహనరావు, దిర్శిపాముల పుష్ప, మేరి, సాల్మన్‌రాజు, ఉండ్రాజవరపు కృష్ణ, దూలపల్లి సత్తియ్య, నాగరాజు, జయసుధ పాల్గొన్నారు.

వచ్చే సీజన్ నాటికి గండ్లు పూడుస్తాం...!



మునిసిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు, కమిషనర్ మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: వచ్చే సార్వా సీజన్ నాటికి ఎర్ర కాలువ గండ్లు పూడ్చి దిగువకు నీరు పోయే మార్గాలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం, నందమూరు, ఆరుళ్ల గ్రామాల్లో ఎర్ర కాలువ ముంపుప్రజలకు బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.3వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు శనగన వరలక్ష్మి, ఉండ్రాజవరపు చంద్రిక, తహసీల్దార్ మురళీకృష్ణ, నాయకులు శనగన రాంబాబు పాల్గొన్నారు.

అధికారుల చర్యలు అభినందనీయం

తాడేపల్లిగూడెం: విస్తారంగా వానలు కురిసిన నేపథ్యంలో 15 రోజుల పాటు పట్టణ ప్రజలకు మునిసిపల్ అధికారులు అందజేసిన సహాయక చర్యలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు అన్నారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులంతా సమష్టి కృషితో ముంపు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా సహాయకచర్యలు అందజేశారన్నారు.

సందడిగా శుభదిన్ భోజనాలు



తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో దాతల సహకారంతో పోషక విలువలతో కూడిన ఆహారపదార్థాలను అందించడమే శుభదిన్ భోజన కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎంఈఓ ఎన్ రమేష్ అన్నారు. అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం ఎంపీయూపీ స్కూల్‌లో సోమవారం శుభదిన్ భోజన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంఈవో –2 ప్రసాద్ మాట్లాడుతూ శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా తిధి భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రమాప్రతిభ, శ్రీనివాస్‌బాబు, త్రివిక్రమరావు, ప్రసాద్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు. పాలిలో పలు ప్రభుత్వ పాఠశాలలో తిధి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు బుద్దాల వెంకటేశ్వరరావు, వీరవల్లి శ్రీనివాస్, మొల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అన్ని మండల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం శిక్ష సప్తాహ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు పాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అంతా సహపంక్తి భోజనం చేశారు. ఎంఈవో వి.హనుమ, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్

పెంటపాడు: మండలంలో సోమవారం శిక్షాసప్తాహ్ (విద్యా వారోత్సవాలు) ముగిసాయి. ఈ సందర్భంగా విప్పర్రు గ్రామంలో శుభతిధి భోజన కార్యక్రమం ఎంఈవోలు ఎం. శ్రీనివాస్, టీవీ రామకృష్ణల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పసల వెంకటచలం(కొండ), పసుపులేటి అమ్మిరాజు, నయనాల సూర్యచంద్రరావు, బోణం నాగసత్యనారాయణ, బాలకృష్ణ, పసల మహేష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెంటపాడు: విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

పాఠశాలలో తిధి భోజనాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శిక్ష సప్తాహ్ కార్యక్రమాలు పట్టణంలోని పాఠశాలలో సోమవారం ముగిసాయి. దాతలు సహాయ సహకారాలతో పట్టణంలోని అన్ని ప్రభుత్వ, మునిసిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలో పిల్లలకు దాతల సహాయ సహకారాలతో తిధి భోజనం, పాలు, పండ్లు, స్వీట్లు అందజేశారు.



అత్తిలి: లక్ష్మీనారాయణపురం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు శుభదిన్ భోజన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎంఈఓలు

మహిళల భద్రతకు మిషన్ శక్తి



నవాబుపాలెం అంగన్‌వాడీ కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించడమే మిషన్ శక్తి ముఖ్య ఉద్దేశ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని నవాబుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ 1098, విమెన్ హెల్ప్ లైన్ 181, బాల్య వివాహాల నివారణకు 18004254156 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

తణుకు: మహిళల కోసం రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని అవగాహన చేసుకుని ఆత్మస్థైర్యంతో జీవించాలని తణుకు ఐసీడీఎస్ ఎ పర్యవేక్షకురాలు ఎం.అరుణకుమారి తెలిపారు. సోమవారం బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా సీఐటీయూ ఇచ్చిన పిలుపులో భాగంగా పట్టణంలోని రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ కార్మికులు సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు సత్తి కోదండ రామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, కరెడ్ల రామకృష్ణలు మాట్లాడుతూ రైల్వే గూడ్స్ షెడ్‌లలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులను నాల్గోవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కర్రి సాయి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అడప ఆంజనేయులు, బుద్దాల నాని, పుత్రయ్య, సుబ్బిరెడ్డి హాజరైయారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను నివారించవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. సోమవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల లార్వాలను గుర్తించి నాశనం చేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మణరావు, గ్రామ ఆరోగ్య కార్యదర్శి సుసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నివారణకు నడుంకట్టాలి

తణుకు అర్బన్: డెంగీ నివారణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో తణుకు 14వ వార్డు పల్లాలమ్మ నగర్‌లో సోమవారం దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మనం తీసుకునే మన జాగ్రత్తే మనల్ని కాపాడుతుందనే విషయాన్ని ప్రజలంతా గుర్తుంచుకోవాలన్నారు. ముఖ్యంగా చేతుల పరిశుభ్రత, ఆహారపదార్థాలపై మూతలు వేసుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ జె.శాంతకుమారి, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.